కథానిక

# నీలి నీడలు

'జయంతి'

మిణుకు మిణుకుమంటూన్న నక్షత్రాలని చూస్తూన్నకొద్దీ రాజారావులో అశాంతి ఎక్కువవుతోంది. చీకటి తనకి ఆ తారకలకి మధ్య అడ్డం రావడంవల్ల అవి అలాగంటున్నాయో, లేక తన కళ్ళకే మధ్యమధ్య మసకలు క్రమ్మడంవల్ల అలాగ కనబడుతున్నాయో అతనికి తేలలేదింకా. ఆ తారకాలు ఎలా గంటున్నా, వాటి మధ్య సుశీల రూపంమాత్రం వెలుగుతూనే వుంది. కళ్ళు తెరిచినా సరే, మూసినా సరే అతనికి కనబడుతూనే వుంది. ఆ రూపాన్ని ఏ చీకటీ ఏ మబ్బూ మరుగుపరచలేదనే అతనికి ధైర్యం.

సుశీల ధనికుల యింట్లో పుట్టిన పేదబాలిక. ఆమె శుభ్రమైన యింట్లో నివసిస్తుంది. ఖరీదైన బట్టలు ధరిస్తుంది. పంచభక్ష్య పరమాన్నాలు భుజిస్తుంది. అయినాసరే ఆమె ధనికురాలు కాదు. ఆమెతల్లి రాజారావుతండ్రి కాలంనుంచీ సేవ చేస్తూ వచ్చింది. ఆమె అనంతరం అదే వృత్తి కుమార్తెనూ ఆవరించింది. తన పనిలోనే సుశీల శరీరాన్నీ, కాలాన్నీ మరచిపోతుంది. పని చెయ్యడమనేదే ఆమెకో ఆనందం. అధికారుల మెప్పును పొందడమే ఆమె పొందజూచే బహుమతీ. ఒక్కరోజూ జిడ్డున చీదదు. కళ్ళు దాచుకోదు. లేచిందిమొదలు రాత్రి నిద్రపోయేదాకా రాజారావు పిల్లలు నలుగురూ సుశీలను ఒక్క క్షణంకూడా విడిచిపెట్టరు. ఆమెకూడా అంతే. వాళ్ళతల్లికూడా యివ్వలేని ఉత్సాహం ఆ పిల్లల కిస్తుంది. అలాంటప్పుడు సుశీలకూ రాజారావుకూ ఒక సన్నిహిత బాంధవ్యం ఏర్పడడంలో ఆశ్చర్యంలేదు. రాజారావు ఆమెను తన భార్యవద్ద పొగడుతాడు. తన కుటుంబంలో ఒకతెగానే భావిస్తాడు.

అలాంటి సుశీల ఈనాడు దినదినం మారిపోతూంది. యౌవనపు రేఖలు ఆవరిస్తూన్న ఆమె శరీరంతోబాటు మనస్సు కూడా మారుతూన్నట్టు సూచనలు కనిపిస్తున్నాయి. ఇదివరకు ప్రతీ చిన్న విషయాన్నీ అమాయకంగా తనతో ప్రసంగించిన సుశీల నెలరోజుల నుండి అతనితో మాట్లాడడానికే సిగ్గుపడుతోంది. తన సమక్షానికి రావడానికే భయపడుతోంది. తనకే పని చేసినా చాటుగా చేసుకుని పోతుంది. ఇవన్నీ తలుచుకుంటూ రాజారావు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఆశ్వయుజ మాసపు చలిగాలులు వీస్తుంటే రాజారావు తర్కవితర్కాలు చేసుకుంటున్నాడు. సుశీలను గురించి ఇంత ఆలోచించడానికి అవసరమేమిటి? ఆమెకూ తనకూ గల సంబంధం ఏమిటి? ఆ సంబంధానికి కారణాలేమిటి? అనుక్షణం తనలో జరిగే అంతర్యుద్ధానికి మూలకారణం ఆమె యౌవనం కాదుకదా! తారకలలా మిలమిల లాడే ఆ కళ్ళు, కిసలయాలలో సమానమైన హస్తాంగుళీలు, సముద్రపు కెరటాలను భావనకు తెచ్చే కంఠంమీది ముడతలు, పులకాంకురాలు ప్రతిబింబించే దేహసంపద–ఇవే తన ఏకాగ్రతను భంగపరిచాయా? రాజారావు ఎందుకో తనలో తాను నవ్వుకున్నాడు. యౌవనం సడలుతూ వలభయోవ్యపడిలో పడుతూన్న తాను మన్మథ రేఖలతో దినదిన ప్రవర్ధమాన అవుతూ మైనారిటీ దాటిపోతూన్న సుశీలను అర్థం చేసుకోలేనందుకు సిగ్గుపడ్డాడు. పోనీ, ఆమెకి పెళ్ళి చేసివేస్తేనో? అదీ అంత సులభం కాదు. ఆమెలో వుండే సుగుణసంపద, సంస్కారం ఎంత ఉన్నతకుటుంబంలోనూ కనబడవు. కనుక ధనికుడైనా గావాలి, విద్యావంతుడైనా రావాలి. అంతవరకూ ఆ విషయాలే తలపెట్టడం మంచిది కాదు. ఈ విషయాలు ఆమెకు తెల్పడం అసలే మంచిది కాదు. దైవపూజకు, ప్రేమపూజకు వినియోగం కాని పుష్పాలు అనాఘ్రాతాలుగా వుండడంలోనే ఘనతను పొందుతాయి. ఇలా పరిపరి విధాల తలపోస్తూ రాజారావు మేను వాల్చాడు.

మర్నాడు సుశీల ఎప్పటిలాగే పనులు చేసు

కుంటూంది. రాజారావుని చూసినప్పు డల్లా ముఖం దాచుకుంటూ చాటుగా పోతూ వచ్చింది. ఆమెలో ఏవో లజ్జారేఖలు వ్యాపించాయి. ఆమె వింతచేష్టలు అతనికి బోధపడలేదు. ఇదంతా యౌవనపు నిషా, భూమ్యాకాశాల భేదం గుర్తింపని అనుభూతి అనుకున్నాడు.

రాత్రి కొంచెం ఆలస్యంగా వస్తున్నాడు రాజారావు ఇంటికి. వీధిమలుపులో దీపపు స్తంభంచాటున ఏవో రెండు నీడలు పెనవేసుకు కదులుతున్నాయి. దూరాన్నుంచే రాజారావు పరకాయించి చూశాడు. అవి భూతాలు కావు. మానవ శరీరాలే. రాజారావు కాలి సవ్వడి ఆ నీడల ఏకాంతానికి అంతరాయ మయింది. ఆ శరీరాలు దూరంగా పరుగెత్తేయి. రాజారావు కిమ్మనలేదు. పైగా ఏదో తప్పుచేసిన వానిలా బాధపడ్డాడు. గుమ్మంలో అడుగు పెట్టేసరికి "సుశీల ఏదీ?" అంది భార్య. "నాకేం తెలుసు? ఇంత రాత్రివేళ ఎక్కడికి వెళ్ళింది?" అన్నాడు రాజారావు.

"మీ ఆఫీసుకు నేనే పంపించాను, చూసి రమ్మని" అంది భార్య. రాజారావు మాట్లాడు తున్నాడు కాని అతని మనస్సు పరిపరి విధాల పోయింది.

"ఇంకెన్నడూ దాన్ని బయటికి పంపవద్దు. లోకం మంచిది కాదు" అన్నాడు. భోజనం చేసి రాజారావు మళ్ళీ సుశీల సంగతే ఆలోచిస్తున్నాడు. వెనకటికి ఒక పులి సర్కస్ వాడి గాయాన్ని నాకి, మర్నాడు వాణ్ణి చంపి తిన్న కథ జ్ఞాపకం వచ్చింది.

ఆ మర్నాటినుండి భార్యాభర్తలు సుశీలను బయటికి పంపడమే మానివేశారు. ఏది కావలసినా రాజారావే స్వయంగా తెస్తాడు. ఇంటికి ఎవరు వచ్చినా అతని భార్య స్వయంగా దర్శన మిస్తుంది. ఇదంతా సుశీల మంచికే అని వాళ్ళ అభిప్రాయం. సుశీల మాత్రం అస్తమానం పరధ్యానంగా వుంటుంది. ఏదో తప్పుచేసిదానిలాగ భయపడుతుంది. ఏకాంతంగా వున్నప్పుడు మాత్రం శూన్యంలోకి వింతగా చూస్తుంది. కన్నీళ్లు కారుస్తుంది.

వారంరోజులు ఇలాగ గడిచాక, ఒకనాటి ఉదయం రాజారావు మామూలుగా మేడమెట్లు దిగుతున్నాడు. "సుశీల మేడమీద వుందా ?" అంది భార్య కింద నుండి. నిర్ఘాంతపోతూ "లేదు" అన్నాడు. "అయితే రాత్రికి రాత్రి తలుపులు తీసుకుని ఎక్కడికో పోయింది" అంది భార్య. రాజారావు అప్రయత్నంగా అన్నాడు:

"ఎక్కడికి పోయింది ? లేచిపోయింది - ఏ పోకిరీ వాడితోనో. మనం ఎంత చేద్దా మనుకుంటే ఏం లాభం? ఎవరి కర్మ వాళ్ళది."

"అలా గనకండి. సుశీల అలాంటిది కాదు. దానంతట అదే వస్తుంది" అంది భార్య.

"నీకేం తెలుసు. దాని పోకడలు నెలరోజుల నుంచీ కనిపెడుతూనే వున్నాను. ఇంక ఒకటే రావడం" అన్నాడు రాజారావు. అలాగన్నా "సుశీల మళ్ళీ తిరిగి వస్తుంది" అన్న ఆశ అతనికి పోలేదు.

నెలరోజులు గడిచాయి. మామూలుగానె ఆ వేళా రాత్రి కొంచెం ఆలస్యంగా వస్తున్నాడు రాజారావు. ఇంటికివచ్చే దారిలో ప్రక్కవీధి ప్లీడరుగారి పెళ్లివారు ఊరేగుతున్నారు మహా ధ్వజాయమానంగా. బాణసంచాలు దివ్యంగా వెలుగుతున్నాయి. నౌబత్ ఖానా బండి అరమైలు ముందుకు సాగినా, శబ్దం చెవుల్లో గింగురు మంటూనే వుంది. ఊరేగింపులో జనసమ్మర్దం ఎక్కువగా వుంది. వాళ్ళని పక్కకి తోసుకుంటూ ముందుకు వచ్చాడు రాజారావు. అతని కళ్ళకి ఆ పెళ్ళికూతురు చిర పరిచితలాగ కనిపించింది. కాదు - సుశీలగానే తోచింది. ఆ ప్రక్కన ఎవరినో అడిగేడు "ఆడ పెళ్లివారి దేవూరు" అని.

"ఆ విషయం నాకు తెలియదు. అబ్బాయి ప్రేమించి పట్నంనుండి తీసుకు వచ్చాడట ఈ పిల్లను. తండ్రి ఎంత చెప్పినా వినలేదు. ఆఖరికి ప్లీడరుగారే ఒప్పుకున్నారు ఏకైకపుత్రుడివాంఛ తీర్చడానికి. అయితేనేమండి, ఎంత లక్షణంగా వుందో చూడండి ఆపిల్ల-లక్ష్మీదేవిలాగా." అన్నాడాయన. తేరిపార చూశాడు రాజారావు. ఆనాడు దీపస్తంభం చాటున కదలిన నీలి నీడలు యివి కావుకదా అనుకున్నాడు. పరకాయించి 'యివే' అన్నాయి అతనికళ్లు; 'ఔ'నని మనస్సు సాక్ష్యం చెప్పింది. సంతోషం పట్టలేక యింటిదారి పట్టేడు, సుశీలరాక భార్యకు తెలపడానికి.